నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వెంకట్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు యహిల్‌రిడ్జ్ విల్లాస్, టిమ్స్ హాస్పిటల్, గోపీచంద్ అకాడమి, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల రాక్ ఎన్‌క్లేవ్, బ్రహ్మకుమారీస్, ఎస్ఎంఆర్ సింఫోనీ, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని చెప్పారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గణేషుడికి ప్రత్యేక పూజలు



రాయదుర్గం: ఆషాఢమాసం సంకష్ట హర చవితిని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివ సాయిక్షేత్రంలో గణేషుడికి సోమవారం ప్రత్యేక అలంకారం నిర్వహించారు. మొదట గణేషుడికి ప్రీతి పాత్రమైన బెల్లం, గరికతో ప్రత్యేక అలంకారం చేశారు. అనంతరం కూరగాయలు, పూలు, పండ్లతో గణేషుడికి శాకంబరి అలంకారం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్ విద్యార్థి కార్యవర్గం ఎన్నిక



రాయదుర్గం: హెచ్‌సీయూలోని క్యాంపస్ స్కూల్ 42వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్కూల్ కెప్టెన్, వైస్ కెప్టెన్, హౌస్ లీడర్‌లను, స్పోర్ట్స్ సెక్రెటరీ, కల్చరల్ సెక్రటరీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మురళి, ఫిజికల్ డైరెక్టర్ సతీష్‌గౌడ్, ఉపాధ్యాయ బృందం, నాన్‌టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

లీకేజీ.. రోడ్డుపై భారీ గుంత



మియాపూర్: తాగునీటి పైపులైన్ లీకేజీ కారణంగా నీరు రోడ్డుపై వృథాగా పోతోంది. దీనికితోడు రోడ్డు మధ్యలో పెద్ద గుంత ఏర్పడడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మియాపూర్ మదీనాగూడలోని విజేత సూపర్ మార్కెట్ పక్క రోడ్డులో పైపులైన్ లీకేజీ కారణంగా నీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. గతంలో పలుమార్లు లీకేజీలకు మరమ్మతులు చేసినా మరలా లీకేజీ ఏర్పడుతోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మురుగు సమస్య పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇస్తున్న ఊట్ల చంద్రారెడ్డి, సభ్యులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్, పాపిరెడ్డినగర్‌లోని బి బ్లాక్ రోడ్డు నంబర్ 1,2లలో మురుగు సమస్యను తక్షణమే పరిష్కరించాలంటూ సోమవారం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కరించే విధంగా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కోశాధికారి నరసింహులు ముదిరాజ్, ఆలయ కమిటీ చైర్మన్ పేర్ని ధర్మారావు, అధ్యక్షులు ఆడెపు ప్రభాకర్ పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం నిర్వహించిన డ్రైవ్‌లో 15 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 13 మందికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి, మరో ఇద్దరికి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

'పీఎంశ్రీ' తో కార్పొరేట్ హంగులు

బాగుపడుతున్న బడి

శేరిలింగంపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు మహర్దశ



కంప్యూటర్ ల్యాబ్



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల రూపురేఖలు మారనున్నాయి. 'పీఎంశ్రీ'తో కార్పొరేట్ హంగులు దిద్దుకోనుంది. జిల్లాలోనే అత్యధిక సంఖ్యలో విద్యార్థులు ఉన్న జెడ్పీహెచ్ఎస్‌గా ఇది గుర్తింపు సాధించింది. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయి మౌలిక వసతుల కల్పించడానికి 'పీఎంశ్రీ' స్కీమ్‌కు రూపకల్పన చేశారు. అందులో భాగంగా శేరిలింగంపల్లి మండలంలో ఈ పాఠశాలగా ఎంపికైంది. నాలుగేళ్లలో ఆధునిక హంగులతో పూర్తి స్థాయిలో సౌకర్యాలను కల్పించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని దశలవారీగా చేపట్టనున్నారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందడంతో పాటు మెరుగైన మార్కులు సాధించడానికి అవకాశం ఏర్పడుతుంది. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకంను ఏడాదిలోనే అమలు చేసేలా చూడాలని పలువురు సూచిస్తున్నారు.

జెడ్పీహెచ్ఎస్‌లో అత్యధిక సంఖ్యలో విద్యార్థులు

- రంగారెడ్డిజిల్లాలో అత్యధికంగా విద్యార్థులు ఉండే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా గుర్తింపు సాధించింది
- ప్రస్తుతం స్కూల్‌లో 1,235 మంది విద్యార్థులున్నారు. వారిలో 618 మంది బాలికలు.. 617 మంది బాలురు ఉన్నారు.
- ఈ ఏడాది స్కూల్‌లో 302 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారు.
- 6వ తరగతిలో 180 అడ్మిషన్లు పొందడం గమనార్హం.

'పీఎంశ్రీ' సౌకర్యాలు ఇవే..

- పీఎం శ్రీ స్కీంకు శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ 2025 జనవరిలో ఎంపికైంది.
- శేరిలింగంపల్లి మండలంలో ఎంపికైన ఏకైక పాఠశాల.. విద్యార్థుల సంఖ్య 1140
- 'పీఎం శ్రీ' స్కీంలో భాగంగా నాలుగేళ్లలో స్కూల్‌లో మెరుగైన వసతులు, విద్యార్థులకు ఫీల్డ్ ట్రిప్స్ తదితర కార్యక్రమాలు చేపట్టనున్నారు.
- విద్యార్థులకు ఆటలు, పాటలు, కథలతో ఉల్లాసంగా విద్యా బోధన చేస్తారు
- స్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్‌కు 10 కంప్యూటర్లు, 1 ల్యాప్‌టాప్ అందించారు.
- సైన్స్ ల్యాబ్‌కు అవసరమైన మెటీరియల్‌ను కూడా అందించారు.
- భారీ స్క్రీన్‌తో ఎల్ఈడీ టీవీ, విద్యార్థులకు 4 మ్యూజిక్ డ్రమ్స్, స్పోర్ట్స్ మెటీరియల్
- స్కీంలో భాగంగా పేరెంట్, టీచర్ మీటింగ్, డిసేబుల్ డే , ఇన్నోవేషన్ డే, యాన్యువల్ డే, సైన్స్ ఫెయిర్, కెరీర్ గైడెన్స్ తదితర కార్యక్రమాల నిర్వహణ.

అర్థమయ్యేలా బోధన

- పాఠశాలలో బోధనా పద్ధతులు రోజురోజుకూ మెరుగుపడుతున్నాయి.
- పేరెంట్, టీచర్ మీటింగ్‌తోపాటు డిసేబుల్ డే వంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా పిల్లల సామర్థ్యంను తల్లిదండ్రులు తెలుసుకునే అవకాశం కలుగుతోంది
- విద్యార్థులకు ఆటలు, పాటలు, కథలతో బోధించడం వల్ల పాఠాలను మరింత సులువుగా అర్థం చేసుకునే అవకాశం కలుగుతుంది.



నెహ్రూ జూ పార్కులో శేరిలింగంపల్లి హైస్కూల్ విద్యార్థులు (ఫైల్)



'ఫీల్డ్ ట్రిప్'ల నిర్వహణ

- ఈ స్కీమ్‌లో భాగంగా 'ఫీల్డ్ ట్రిప్'లను నిర్వహించి పలు విషయాలను అర్థం చేసుకునేలా చేయడమే లక్ష్యం
- జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే ఈ ఫీల్డ్ ట్రిప్‌లను ఆరంభించారు.
- అందులో భాగంగా శంకర్‌పల్లి వైల్డ్ వాటర్, నెహ్రూ జూ పార్కు, బిర్లా ప్లానిటోరియం తదితర ప్రాంతాలకు విద్యార్థులను తీసుకెళ్లారు.

టీచర్ల పోస్టులు భర్తీ చేయాలి

- జిల్లాలోనే అత్యధిక సంఖ్యలో విద్యార్థులుండే పాఠశాలలో టీచర్ పోస్టులను భర్తీ చేస్తే విద్యార్థులకు మేలు చేకూరుతుంది
- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాల్సి ఉంది.
- సాంఘిక శాస్త్రంలో 2 పోస్టులు, జీవశాస్త్రంలో రెండు 2, ఫిజిక్స్, పీడీ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది.

అడ్మిషన్లు పెరిగాయి..



'పీఎం శ్రీ స్కీమ్'తో విద్యార్థులకు మెరుగైన విద్యనభ్యసించే అవకాశం కలుగుతోంది. ఈ పథకంతో స్కూల్‌లో సౌకర్యాలు మెరుగుపడుతుండటంతో ఈ ఏడాది ఇప్పటికే 302 అడ్మిషన్లు కొత్తగా రావడం గమనార్హం. ఈ స్కీమ్‌తో కొత్తగా ఫీల్డ్ ట్రిప్స్, పలు కార్యక్రమాలతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరుగుతున్నాయి.

– పి.బల్వంతరెడ్డి, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు, శేరిలింగంపల్లి హైస్కూల్

20న 'సమర్పణ్ సమారోహ్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఈనెల 20వ తేదీన 'డివైన్ సమర్పణ్ సమారోహ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో మధుబన్‌కు చెందిన బి.కె. ఉషాదీదీ, శాంతి సరోవర్ డైరెక్టర్ బి.కె.కుల్‌దీప్ దీదీ పర్యవేక్షణలో పలువురు స్వాములు, గురువులు పాల్గొంటారు.

శంకుస్థాపన

ఆల్విన్‌కాలనీ: రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ హాజరై కొబ్బరి కాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో పోశెట్టిగౌడ్, ప్రభాకర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

నిర్వహణ లేక..



మియాపూర్: లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన మోడ్రన్ టాయిలెట్స్ (మూత్రశాలలు) నిరుపయోగంగా మారాయి. మియాపూర్‌లోని ప్రధాన రహదారుల పక్కన లక్షలాది రూపాయలు వెచ్చించి మూత్రశాలలను ఏర్పాటు చేశారు. నిర్వహణ లేకపోవడంతో మూత్రశాలలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. అలాగే నీటి సౌకర్యం సరిగా లేదంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో రోడ్ల పక్కన బహిరంగంగా మూత్ర విసర్జన చేస్తుండడంతో ఆ రోడ్ల వెంబడి రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే

గచ్చిబౌలి: ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని వెస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే ఆదేశించారు. సోమవారం శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయా విభాగాల అధికారులతో జోనల్ కమిషనర్ హాజరయ్యారు. జోనల్ కార్యాలయంలో 4, శేరిలింగంపల్లి సర్కిల్‌లో 7, యూసుఫ్‌గూడ సర్కిల్‌లో 3, చందానగర్ సర్కిల్ 5 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ , శానిటేషన్‌కు సంబంధించిన ఫిర్యాదులపై ఆయా విభాగాల అధికారులు చర్యలు తీసుకోవాలని జడ్సీ హేమంత్ ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన తీసుకున్న చర్యలపై నివేదిక అందించాలని సూచించారు.

చందానగర్‌లో..

చందానగర్: చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 9 ఫిర్యాదులు వచ్చాయని ఉపకమిషనర్ శశిరేఖ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టౌన్‌ప్లానింగ్ 3, ఇంజనీరింగ్ 2, శానిటేషన్ 2, రెవెన్యూ 1, యూసీడీ 1 ఫిర్యాదు వచ్చాయి. కార్యక్రమంలో ఏసీపీ నాగిరెడ్డి, ఇంజనీరింగ్ డీఈ దుర్గప్రసాద్, ఏఎంహెచ్ఓ డాక్టర్ రవికుమార్, యూబీడీ అధికారులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మాణిక్‌రెడ్డి యూత్ అసోసియేషన్ చేయూత అందించింది. విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను అసోసియేషన్ సభ్యులు, స్థానికులు అందించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు పలకలను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, స్థానికులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, సాయిరామ్, నాగార్జున, నరేందర్, శ్రీకాంత్, ప్రశాంత్, ప్రవీణ్‌కుమార్, కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి ,అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోటుపుస్తకాలు అందించిన దృశ్యం

చెత్తను డస్ట్‌బిన్లలోనే వేయాలి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్‌కు చెందిన ప్రజలు, వ్యాపారస్తులు తమ ఇళ్లతో పాటు వ్యాపార కేంద్రాల్లోని చెత్త చెదారాన్ని తమ వద్దకు వచ్చే చెత్త సేకరణదారులకు అందించాలని లేదా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్లలో వేయాలని రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ సూచించారు. సోమవారం రాంకీ సంస్థ ఆధ్వర్యంలో అందజేసిన డస్ట్‌బిన్లను ప్రధాన రహదారుల వెంట ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రధాన రోడ్లపై చెత్త వేయవద్దని సూచించారు. కొందరు తమ ఇళ్లలోని చెత్తను ద్విచక్ర వాహనాలు, కార్లలో వెళుతూ రోడ్డు పక్కన పారవేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్‌లలో మాత్రమే వేయాలని కోరారు. రాంకీ సంస్థ ఆధ్వర్యంలో ప్రధాన రహదారులపై ఏర్పాటు చేస్తున్న డస్ట్‌బిన్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాలనీలు పరిశుభ్రంగా ఉంటే మనందరం ఆరోగ్యంగా ఉంటామన్నారు. ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ ప్రవీణ్ కుమార్, రాంకీ సంస్థ సూపర్‌వైజర్ నరసింహ రెడ్డి, జవాన్ బాబయ్య, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రేక్ డౌన్.. ట్రాఫిక్ జాం

గచ్చిబౌలి: రద్దీ సమయాల్లో వాహనాలు రోడ్లపై బ్రేక్‌డౌన్ అవుతుండడంతో ట్రాఫిక్ జాం నెలకొంటుంది. వాహనాల రాకపోకలకు అంతరాయం కల్గుతోంది. సోమవారం ఉదయం 10.10 గంటల సమయంలో గచ్చిబౌలి ఫ్లై ఓవర్‌పై ఓ ప్రైవేట్ బస్సు బ్రేక్‌డౌన్ అవడంతో టెలికాంనగర్ నుంచి ఇందిరానగర్ వైపు వెళ్లే వాహనాల రాకపోకలకు ఆటంకం కల్గింది. మాదాపూర్, కూకట్‌పల్లి, మెహిదీపట్నం తదితర ప్రాంతాల నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, లింగంపల్లి వైపు వెళ్లే వాహనాల రాకపోకలు మందకొడిగా సాగాయి. మరమ్మతులు చేసిన అనంతరం రాయదుర్గం ట్రాఫిక్ పోలీసులు బస్సును పక్కకు తరలించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.



గచ్చిబౌలి ఫ్లైఓవర్‌పై బ్రేక్‌డౌన్ అయిన ప్రైవేట్ బస్సు

వైభవంగా శ్రీలక్ష్మీగణపతి హోమం



చందానగర్: సంకటహర చతుర్థి సందర్భంగా సోమవారం శ్రీ విశాఖ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి ఆధ్వర్యంలో స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి పర్యవేక్షణలో లక్ష్మీ గణపతి హోమం వైభవంగా నిర్వహించారు. చందానగర్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కొనసాగుతున్న చాతుర్మాస దీక్ష లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



బాధిత కుటుంబసభ్యుడికి చెక్కును అందజేసిన ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీకి చెందిన పూర్ణచందర్ వైద్యచికిత్స నిమిత్తం మంజూరైన 14 వేల ఆర్థిక సహాయానికి సంబంధించిన సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధిత కుటుంబ సభ్యునికి ఎమ్మెల్యే గాంధీ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ఆపదలో ఉన్నవారికి ఆర్థిక భరోసా ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయినేని చంద్రకాంత్‌రావు, జిల్లా గణేష్, పురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను టార్గెట్‌ను పూర్తి చేయాలి

రాజేంద్రనగర్: ఆస్తిపన్ను వసూళ్లపై రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం డిప్యూటీ కమిషనర్ డాక్టర్ రవి కుమార్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌లతో పాటు బిల్లు కలెక్టర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తమకు విధించిన టార్గెట్‌ను ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలన్నారు. రోజువారీ ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. మొండి బకాయిలపై ఇప్పటి నుంచే దృష్టి సారించాలని ఆదేశించారు. మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేయడంతో పాటు వారి ఆస్తుల జప్తునకు నోటీసులు అందించాలన్నారు. నెలవారి టార్గెట్‌ను ప్రతి ఒక్కరూ పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్య రక్షణ

శంషాబాద్ రూరల్: పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని కొండా లక్ష్మణ్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ వీసీ డాక్టర్ రాజిరెడ్డి అన్నారు. ఉద్యాన యూనివర్సిటీ సహకారంతో మండలంలోని పాల్మాకుల మోడల్ స్కూల్ ఆవరణలో 'యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాం- స్కూల్ ఎర్త్ క్లబ్' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ఉద్యాన యూనివర్సిటీ కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఇలాంటి గార్డెన్లతో విద్యార్థులకు తాజా పౌష్టికాహారంతో పాటు పాఠశాల ఆవరణ ఆహ్లాదాన్ని పంచుతుందన్నారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారంతో పాటు మంచి అలవాట్లను పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ప్రిన్సిపాల్ రజనీకుమారి, ప్రతినిధులు భగవాన్, చీనానాయక్, పంకజ్‌రెడ్డి, జీవీ.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



గుండె సంబంధిత సమస్యలు క్లిష్టంగా మారుతున్నాయి

స్టార్ ఆస్పత్రుల మేనేజింగ్ డైరెక్టర్ డా.గోపీచంద్ మన్నం

రాయదుర్గం: భారతదేశంలో గుండె సంబంధిత సమస్యలు క్లిష్టంగా మారుతున్నాయని స్టార్ ఆస్పత్రుల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపీచంద్ మన్నం పేర్కొన్నారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని స్టార్ ఆస్పత్రిలో గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించేందుకు 'స్టార్ హార్ట్ ఫెయిల్యూర్ క్లినిక్'ను సోమవారం ఆయన వైద్యబృందంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ దేశాల్లో గుండె సంబంధిత వ్యాధులు 70 ఏళ్ళ వయస్సులో కనిపిస్తే మనదేశంలో 50-60 ఏళ్ల మధ్యనే కనిపిస్తున్నాయని అన్నారు. హార్ట్ ఎటాక్ వస్తుందని తెలుసు కానీ ఆ సమస్య రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో అవగాహన లేకపోవడమేనని అన్నారు. అందుకే స్టార్ ఆస్పత్రి గుండె సంబంధిత వ్యాధుల పట్ల అవగాహన కల్పించేందుకు హార్ట్ ఫెయిల్యూర్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అడ్వాన్స్ హార్ట్ ఫెయిల్యూర్ అండ్ ట్రాన్స్‌ప్లాంట్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సురేష్ ఎర్ర మాట్లాడుతూ భారతదేశంలో ముఖ్యంగా పనిచేసే వయస్సు గలవారిలో గుండె వైఫల్యం కేసులు గణనీయంగా పెరిగిపోతున్నాయని, ప్రతి ఏటా 1.8 మిలియన్ల కొత్త కేసులు నిర్ధారణ అవుతున్నాయని వివరించారు. తెలంగాణలో మాత్రమే 2022లో గుండె మరణాలు 282 నమోదయ్యాయని, వీటిలో ఎక్కువ మంది 30- 50 సంవత్సరాల వయస్సు గల పురుషులు ఉన్నారన్నారు. హైదరాబాద్ నగరంలో రక్తపోటు, మధుమేహం, ఊబకాయం,ఒత్తిడి కారణంగా ఇది గుండె సంబంధిత ప్రమాదాలకు కేంద్రంగా మారిందన్నారు. కార్యక్రమంలో స్టార్‌ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



హార్ట్ ఫెయిల్యూర్ క్లినిక్‌ను ప్రారంభించిన డా.గోపీచంద్, వైద్యులు

జారి పడి కూలీ మృతి

గచ్చిబౌలి: గ్రిల్‌పై కూర్చుని ఫోన్ మాట్లాడుతూ ఓ కూలీ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఝార్ఖండ్, చత్ర జిల్లా, సిల్‌దాగ్‌కు చెందిన సుఖి భుయాన్(26) తన సోదరుడు చర్కు కుమార్‌తో కలిసి నగరానికి వలస వచ్చారు. గోపన్‌పల్లిలో అపర్ణ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో కూలీగా పని చేస్తూ ఎన్‌టీఆర్ నగర్‌లో లేబర్ క్యాంప్ సి-2లో నివాసం ఉంటున్నారు. ఆదివారం రాత్రి మొదటి అంతస్తులో గ్రిల్‌పై కూర్చుని ఫోన్ మాట్లాడుతూ జారి కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. మొదట సిటిజన్ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఫలహారం బండి ఊరేగింపు

ఆల్విన్‌కాలనీ: బోనాల సందర్భంగా దత్తాత్రేయ కాలనీలో పాండు గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఫలహారం బండి నిర్వహించారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, యువనేత రామకృష్ణ గౌడ్, నాయకులు సమ్మారెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటనాయక్, పోశెట్టి గౌడ్, అశోక్ తదితరులు హాజరయ్యారు.